క్లుప్తంగా

ఆధ్యాత్మిక కార్యక్రమాలకు విరాళం



విరాళం అందజేస్తున్న దాత

కుల్కచర్ల: ఆధ్యాత్మిక కార్యక్రమాలతో మానసిక ప్రశాంతత లభిస్తుందని కాంగ్రెస్ పార్టీ యువనేత కుమ్మరి స్వామి అన్నారు. శనివారం చెరువుముందలితండా(కె) ఆంజనేయస్వామి దేవాలయానికి రూ.25వేలు, గోరిగడ్డతండా సేవాలాల్ ఆలయానికి రూ.16వేలు విరాళాన్ని ఆయన అందజేశారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ సేవాభావంతో మెలగాలని, ఆలయాల అభ్యున్నతికి తోడ్పాటునందించాలని సూచించారు. తమవంతుగా ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణకు ఎల్లప్పుడూ అండగా ఉంటామన్నారు. రాంచంద్రయ్య, అంగూర్, చందర్, రాజు ఉన్నారు.

ఎల్ఓసీ పత్రాల అందజేత



పత్రాలు అందజేస్తున్న ఆనంద్‌రెడ్డి

కొడంగల్: మండల పరిధి రుద్రారం గ్రామానికి చెందిన బోయ తిప్పమ్మ అనారోగ్య సమస్యలతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ మేరకు వైద్య ఖర్చుల కోసం సీఎంఆర్ఎఫ్ కింద రూ.1,40,000 వేల ఎల్ఓసీ పత్రాన్ని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి ఆదేశాల మేరకు ఆ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఆనంద్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులకు శనివారం అందజేశారు.

పుస్తకాల పంపిణీ



పుస్తకాలను తరలిస్తున్న ఎమ్మార్సీ సిబ్బంది

తాండూరు రూరల్: ప్రభుత్వ పాఠశాలలకు ఎమ్మార్సీ కార్యాలయం నుంచి పుస్తకాలు పంపిణీ చేస్తున్నారు. తాండూరు పట్టణం, రూరల్ కలిపి 70 సర్కారు బడులకు 54 వేల పుస్తకాలు వచ్చాయి. వీటిని ఎమ్మార్సీ సిబ్బంది ఆయా పాఠశాలలకు వాహనాల్లో తరలిస్తున్నారు. పాఠ్యపుస్తకాలతో పాటు నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్నారు.

ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

కొడంగల్: పట్టణ శివారులోని షేక్ పహాడి దర్గాలో ముస్లింలు శనివారం దీపాలు వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఫజర్ నమాజ్ ఖురాన్ ఖానీ పాతిహా పఠించారు. దర్గా కమిటీ అధ్యక్షుడు షేక్ షబ్బీర్ అహ్మద్ ఖాద్రి ఆధ్వర్యంలో గంధం నిర్వహించారు. కార్యక్రమంలో గుల్బర్గాకు చెందిన జిలానీ పాషా, యాద్గిర్‌కు చెందిన మహ్మద్ హుస్సేన్, మైనార్టీ నాయకులు ఎస్ఎమ్ గౌసస్, ఆసీఫ్‌ఖాన్, ఖైరత్ అలీ ఖాద్రి సయ్యద్ జుబేర్ తదితరులు పాల్గొన్నారు. ఇందిలా ఉండగా.. పట్టణంలోని మక్కా మజీద్‌లో.. జామియా నిజామియా సలాం పఠించారు. మసీద్ ఇమామ్ ఖతీబ్ ఖారీ మహ్మద్ అబ్దుల్ కరీం, ఖలాఫా సయ్యద్, మహ్మద్ మదానీ మియాన్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

జగ్గప్ప కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న స్నేహితుడు

యాలాల: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జగ్గప్ప కుటుంబానికి బాల్య స్నేహితులు ఆర్థిక సాయం చేసి మానవత్వం చాటుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధి జక్కేపల్లికి చెందిన డక్కలి జగ్గప్ప కరాటే మాస్టర్.. కొడుకు బ్రూస్లీతో శుక్రవారం తాండూరు పని ముగించుకుని బైక్‌పై తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా.. మండల సరిహద్దులోని బైపాస్ రోడ్డు సమీపంలో మినీ డీసీఎం వీరి వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో జగ్గప్ప తలకు తీవ్ర గాయం కాగా.. ఆయన కొడుకు బ్రూస్లీ స్వల్ప గాయాలతో బయట పడ్డాడు. తీవ్రగాయాలతో జగ్గప్పను చికిత్స నిమిత్తం నగరంలోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న మిత్రులంతా కలిసి రూ.11వేలను బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. జగ్గప్ప ఆరోగ్య పరిస్థితి విషమంగానే ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు.

కూర'గాయాలు'

- కోయకుండానే కన్నీళ్లు తెప్పిస్తున్న ఉల్లి
- మాంసాహారాలతో పోటీపడుతున్న కాయగూరలు
- మండుతున్న ధరలతో మహిళల ఆందోళన



ధారూరులోని కూరగాయల సంత

ధారూరు: మాంసాహారాలతో కూరగాయల ధరలు పోటీపడుతున్నాయి. తామేమీ తక్కువ కాదంటూ కిలో రూ.80 నుంచి 100 ఆపైకి ఎగబాకి వంటింట్లో మంటలు పుట్టిస్తున్నాయి. రూ.200 పెడితే వారానికి సరిపడా వచ్చే కూరగాయలు.. ఇప్పుడు వెయ్యి పెడితే కానీ రావటం లేదంటూ మహిళలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. బీన్నీస్ కిలో రూ.90, టమాట రూ.100, పచ్చి మిరప రూ.110, కాకర రూ.100, క్యారెట్ రూ.85, బెండకాయ రూ.90, బీర రూ.80, చిక్కుడు రూ.85, వంకాయ రూ.90 ఇలా కూరగాయల ధరలు పెరిగి చుక్కలు చూపెడుతున్నాయని మధ్య, దిగువ తరగతి కొనుగోలుదారులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. కిలోకు బదులు పావుకిలో, అరకిలో కొనుగోలు చేస్తున్నట్లు పేర్కొంటున్నారు. కూరగాయలు లేకున్నా.. ఉల్లిగడ్డ పప్పుతో సరిపెట్టుకునే వారమని, ప్రస్తుతం ఆ ఉల్లి కోయకుండానే కన్నీళ్లు తెప్పిస్తోందని వాపోతున్నారు. రూ.40 నుంచి 50కి చేరి ఇరుకున పడేసిందన్నారు. ఒక్కో కుటుంబానికి వారానికి కనీసం 5 కిలోల వరకు ఉల్లిగడ్డ అవసరం పడుతుందని, ప్రస్తుతం దానికే రెండు మూడొందలు వెచ్చిస్తే.. మిగతావి ఎలా కొనుగోలు చేయాలంటూ విచారం వ్యక్తంచేస్తున్నారు. గత్యంతరం లేక.. సగంసగంతో సరిపెట్టుకుంటున్నామని, ఇలా ధరలు పెరుగుకుంటూ పోతే.. ఏం తిని బతికేదంటూ వాపోతున్నారు.

మార్కెట్‌కు తగ్గిన వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతి

ధారూరు: స్థానిక వ్యవసాయ మార్కెట్‌కు సాగు ఉత్పత్తుల దిగుబడి దిగుమతి క్రమంగా తగ్గుతోంది. గత వారం దొడ్డు రకం వడ్లు 1,606 బస్తాలు రాగా.. ఈ వారం కేవలం 143 బస్తాలు వచ్చాయని కార్యదర్శి సిద్దమ్మ తెలిపారు. అలాగే సన్న రకం సోన గతవారం 1,623 రాగా, ప్రస్తుతం 120 బస్తాలు వచ్చినట్లు వెల్లడించారు. శనివారం సన్న రకం వడ్లు (సోన) ధాన్యం 120 బస్తాలు రాగా.. బీట్లలో క్వింటాకు రూ.2,190 నుంచి రూ.2,280 వరకు ధరతో కొనుగోలు చేసినట్లు కార్యదర్శి పేర్కొన్నారు. అలాగే దొడ్డు రకం ధాన్యం క్వింటాల్‌కు రూ.2,100 నుంచి రూ.2,125 ధరతో కొనుగోలు చేసినట్లు తెలిపారు. మొక్కజొన్న 46 బస్తాలు రాగా.. క్వింటాకు రూ.2,450 నుంచి రూ.2,460 ధరతో సేకరించినట్లు వివరించారు. మొక్కజొన్నకు గత వారంతో పోల్చుకుంటే.. ప్రస్తుతం క్వింటాకు రూ.90 పెరిగినట్లు స్పష్టంచేశారు.

సమావేశంలో మాజీ సర్పంచ్ వీరంగం

అధికారుల చొరవతో సద్దుమణిగిన వ్యవహారం



సభలో ఎంపీపీని నిలదీస్తున్న మాజీ సర్పంచ్ సురేశ్

దోమ: 'ఎంపీటీసీ రాములుకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఐదేళ్లుగా అతన్ని సర్వసభ్య సమావేశానికి ఎలా అనుమతిస్తున్నారు' అని మాజీ సర్పంచ్ కోళ్ల సురేశ్ ఎంపీపీని నిలదీశారు. శనివారం మండల కేంద్రంలో ఎంపీపీ అనసూయ అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశం కొనసాగుతున్న నేపథ్యంలో మాజీ సర్పంచ్.. మధ్యలో చొరబడి బొంపల్లి ఎంపీటీసీ రాములుపై తీవ్ర ఆరోపణలు చేస్తూ.. వీరంగం సృష్టించారు. అధికారులు, సభ్యులు నచ్చజెప్పినా వినకపోవడంతో.. ఏదైనా సమస్య ఉంటే న్యాయస్థానంలో తేల్చుకోవాలని సూచిస్తూ.. అతన్ని బయటకు పంపారు.

రాజకీయ కుట్ర

రాజకీయంగా తనను ఇబ్బంది పెట్టడానికి కొందరు కుట్ర చేస్తున్నారని ఎంపీపీ రాములు అనుమానం వ్యక్తంచేశారు. రెండు దశాబ్దాలుగా ప్రజాప్రతినిధిగా కొనసాగుతున్నానని, ఇప్పటి వరకు ఎలాంటి సమస్య రాలేదని తెలిపారు. 2013 నుంచి 2016 వరకు వికారాబాద్ కోర్టులో అధిక సంతానం కేసు కొనసాగిందని, ముగ్గురు పిల్లలు కాదు.. ఇద్దరే ఉన్నారని కోర్టు తీర్పు చెప్పిందని వెల్లడించారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యులు ఖాజపాష తదితరులు పాల్గొన్నారు.

భాషా పండితుల సమష్టి విజయం

అనంతగిరి: పదోన్నతులు లేకుండా పనిచేస్తున్న భాషా పండితులకు సుప్రీం కోర్టు ఊరటనిచ్చిందని ఆర్‌యూపీటీ జిల్లా కార్యదర్శి రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. పదోన్నతుల్లో భాషా పండితులతో కలిపి ఉమ్మడిగా ఇవ్వాలని ఎస్‌జీటీలు వేసిన కేసును సుప్రీంకోర్టు కొట్టివేసింది. దీంతో రాష్ట్రంలో ఉపాధ్యాయ పదోన్నతులు యథావిధిగా కొనసాగనున్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా భాషా పండితుల తరఫున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, విద్యాశాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

త్వరలో రూ.5కే భోజనం

కొడంగల్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో రూ.5కు భోజన పథకం త్వరలో ప్రారంభం కానుందని అధికారిక వర్గాల ద్వారా తెలుస్తోంది. హరే రామ హరే కృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ పథకాన్ని ప్రారంభించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. రోగులతో పాటు వారి వెంట వచ్చే సహాయకుల ఆకలి తీర్చేందుకు ఈ పథకం దోహదపడుతుందని పలువురు పేర్కొంటున్నారు.

కష్టపడే తత్వాన్ని అలవర్చుకోండి

పరిగి: విద్యార్థులు కష్టపడే తత్వాన్ని అలవర్చుకోవాలని ప్రధానోపాధ్యాయుడు రాములు అన్నారు. శనివారం మండల పరిధి రంగంపల్లి ప్రాథమిక పాఠశాలలో గ్రామానికి చెందిన శివ శంకర్(ఏఎస్ఐ) జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు అందజేశారు. అనంతరం ప్రధానోపాధ్యాయుడు మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలు అందజేయడం సంతోషంగా ఉందన్నారు. సర్కారు బడుల బలోపేతానికి వారు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. కార్యక్రమంలో దాతలు విజయ, శ్వేత, స్వాతి, ప్రశాంత్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోండి

శంకర్‌పల్లి: దుకాణాల ఎదుట అవకాశం ఉన్న ప్రతి ఒక్క యజమాని సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని శంకర్‌పల్లి డీఐ నాగరాజు సూచించారు. శనివారం పట్టణంలోని బీడీయల్ చౌరస్తాలో దుకాణాదారులకు నేరాలపై అవగాహన కల్పించారు. డీఐ మాట్లాడుతూ.. దొంగలు చాలా వరకు తాళం వేసిన ఇళ్లు, దుకాణాలే లక్ష్యంగా చేసుకొని దోపిడీలకు పాల్పడుతున్నారని, దొంగలను పట్టుకోవడానికి సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. అదే విధంగా అపరిచితుల నుంచి వచ్చే మెసేజ్‌లు, ఫోన్ కాల్స్‌కి స్పందించొద్దని సూచించారు. పరిసరాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా తిరిగితే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు.

కార్యకర్తల కష్ట ఫలితమే.. విజయం

- వారికి రుణపడి ఉంటా
- చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డితో పార్టీ శ్రేణులు

కుల్కచర్ల: మోదీని మరోసారి ప్రధానిగా చేయాలన్న సంకల్పమే చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గంలో కాషాయ జెండా రెపరెపలాడేలా చేసిందని, అందుకు కృషి చేసిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు, గౌరవం ఉంటుందని ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం కొండాను మర్యాదపూర్వకంగా బీజేపీ మండల శ్రేణులు కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడారు. కార్యకర్తల కష్ట ఫలితమే పార్టీ హ్యాట్రిక్ విజయం సాధించిందని తెలిపారు. అందుకు పార్టీ శ్రేణులకు రుణపడి ఉంటామన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇదే స్ఫూర్తిని కనబర్చాలని పిలుపునిచ్చారు. ఇందులో పార్టీ జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల సౌమ్య, పార్టీ మండల అధ్యక్షుడు సురేష్, ప్రధాన కార్యదర్శులు హన్మంతు, నర్సింహా రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు మైపాల్, అసెంబ్లీ కన్వీనర్ గడుసు మైపాల్, మండల కోశాధికారి కాటనిపల్లి మైపాల్, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు భీమయ్య, మండల ఉపాధ్యక్షుడు జుట్టు వెంకట్ రెడ్డి, నాయకులు రెడ్డి రవిచందర్, శ్రీనివాస్ గౌడ్, బచ్చయ్య, శేఖర్ తదితరులు ఉన్నారు.

విస్తృతంగా భగీరథ నీటి సర్వే



దుద్యాల్: మైల్వార్ గ్రామంలో సర్వే చేస్తున్న జీపీ కార్యదర్శి డేవిడ్

దుద్యాల్: మిషన్ భగీరథ తాగునీటి సరఫరాపై గ్రామపంచాయతీ, ఏకేపీ సిబ్బంది ఇంటింటికీ తిరుగుతూ సర్వే చేస్తున్నారు. నీటి సరఫరా సరిగా అవుతుందా? అవి సరిపోతున్నాయా? ఇంట్లో ఎంతమంది సభ్యులు ఉంటారు అంటూ తదితర వివరాలను సేకరిస్తున్నారు. అనంతరం ప్రత్యేకంగా రూపొందించిన భగీరథ యాప్‌లో సమాచారాన్ని నిక్షిప్తం చేస్తున్నారు. భగీరథ నల్లా కనెక్షన్‌కు ఇంటి యజమాని ఆధార్ కార్డు నంబర్ లింకు చేస్తున్నారు. శనివారం మండల పరిధి చిలుముల మైల్వార్ గ్రామంలో పంచాయతీ కార్యదర్శి డేవిడ్ ఇంటింటికి తిరుగుతూ నల్లా కనెక్షన్ ఉన్న ఇంటి యజమాని వివరాలు సేకరించారు.

ధారూరులో..

ధారూరు: భగీరథ తాగునీటి సరఫరాపై గ్రామ పంచాయతీ, ఐకేపీ సిబ్బంది ధారూరు గ్రామ పంచాయతీ పరిధిలో ఇంటింటి సర్వేకు శ్రీకారం చుట్టారు. నల్లా కనెక్షన్ ఉన్న ప్రతి ఇంటికి వెళ్లి, కుటుంబ సభ్యుల వివరాలను సేకరించారు. యజమాని ఫొటోను చిత్రీకరించారు. 450 ఇళ్లను సర్వే చేసినట్లు గ్రామ కార్యదర్శి అంజ్యానాయక్ తెలిపారు.

సర్కారు బడుల్లో సకల సౌకర్యాలు

- మీ చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి
- ప్రధానోపాధ్యాయుడు సంతోష్



అక్షరాభ్యాసం కార్యక్రమంలో ఉపాధ్యాయులు, చిన్నారుల తల్లిదండ్రులు

కుల్కచర్ల: సర్కారు బడుల్లో సకల సౌకర్యాలు లభిస్తున్నామని, మీ చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి ప్రధానోపాధ్యాయుడు జంగం సంతోష్ అన్నారు. నివారం మండల పరిధి ముజాహిద్‌పూర్ గ్రామపంచాయతీ సందనిగడ్డ కాలనీ ప్రాథమిక పాఠశాలలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బడీడు పిల్లలు బడిలోనే ఉండాలని, చదువుతోనే వారికి సర్వస్వం అని, కావున తల్లిదండ్రులు తమ పిల్లలను తప్పనిసరిగా చదివించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను బోధించడమే కాకుండా.. ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్కులు, మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్నట్లు వెల్లడించారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా కొనసాగుతున్న సర్కారు బడుల్లో చిన్నారులను చేర్పించి, వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని ప్రధానోపాధ్యాయుడు సూచించారు. ఇందులో ఉపాధ్యాయురాలు సుమ, అమ్మ ఆదర్శ కమిటీ చైర్‌పర్సన్‌లు సత్యమ్మ, వెంకటేశ్వరి ఉన్నారు.

పాఠశాలల బలోపేతానికి కృషి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కేశంపేట: ప్రభుత్వ బడుల బలోపేతానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శనివారం మండల పరిధి కొత్తపేట గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట కార్యక్రమాన్ని విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే, స్త్రీశిశు సంక్షేమ శాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ తాండ్ర విశాలతో కలిసి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించి, చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించి మాట్లాడారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. పాఠశాలల అభివృద్ధికి రాజకీయాలకు అతీతంగా నాయకులు కృషి చేయాలన్నారు.

జిల్లాలో బదిలీలు చేపట్టాలని వినతి..

రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఉపాధ్యాయుల బదిలీలకు ఇటీవల శ్రీకారం చుట్టింది. రాష్ట్రంలో రంగారెడ్డి జిల్లాలో తప్పా రాష్ట్ర వ్యాప్తంగా బదిలీల ప్రక్రియ కొనసాగుతోందని, జిల్లాలో కూడా బదిలీల ప్రక్రియ కొనసాగే విధంగా చూడాలని ఉపాధ్యాయులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. బదిలీల ప్రక్రియ లేకపోతే ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోతారని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఇందులో తహసీల్దార్ అజీం అలీ, ఇన్‌చార్జి మండల విద్యాధికారి మనోహర్, మండల ఇన్‌చార్జి ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి, ఎంపీటీసీలు సురేశ్ రెడ్డి, మల్లేశ్‌యాదవ్, నాయకులు జగదీశ్వర్, వీరేశ్, శ్రీధర్‌రెడ్డి, సురేశ్, పాఠశాల హెచ్ఎం చంద్రశేఖర్, శ్రీనివాససాగర్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాల దందా

ఆ పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్



పాఠశాల ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

చేవెళ్ల: ప్రైవేట్ పాఠశాలల్లో నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాల విక్రయాలు జరుగుతున్నాయని వీటిపై విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదులు చేసినా స్పందించటం లేదని ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ కార్యదర్శి బి.అరుణ్‌కుమార్ ఆరోపించారు. మండలంలోని వివేకానంద ఇంటర్‌నేషనల్ స్కూల్‌లో శనివారం పుస్తకాలు అమ్ముతున్నారనే సమాచారంతో ఎస్ఎఫ్ఐ నాయకులు అక్కడికి వెళ్లి ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమకు వచ్చిన సమాచారంతో పాఠశాలకు వెళ్లి చూడగా అక్కడ పుస్తకాలు విక్రయిస్తున్నట్లు గుర్తించామని తెలిపారు. వాటిని చూసి ప్రశ్నిస్తే పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు తమపైనే ఎదురుదాడి చేస్తూ దురుసుగా ప్రవర్తించడమే కాకుండా.. దూషించారని పేర్కొన్నారు. అంతేకాకుండా జీఓ 1కు విరుద్ధంగా పుస్తకాలు ఎందుకు అమ్ముతున్నారని ప్రశ్నిస్తే.. అమ్ముకుంటాం. అన్ని పాఠశాలల్లో అమ్ముతలేరా? ఏం చేసుకుంటారో చేసుకోండి. ఎవరికి ఫిర్యాదు చేస్తారో చేసుకోండి అంటూ దబాయించారని ఎస్ఎఫ్ఐ నాయకులు తెలిపారు. దీనిపై అక్కడి నుంచే మండల విద్యాధికారి అక్బర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశామని చెప్పారు. కానీ ఆయన 3గంటలకు వస్తాను, అప్పుడు పాఠశాల యాజమాన్యం, మీరు మేము కలిసి కూర్చొని మాట్లాడుకుందామని చెప్పారని వెల్లడించారు. ఎంఈఓ చెప్పినదాన్ని బట్టి చూస్తుంటే.. ఆ యాజమాన్యానికి ఆయన వత్తాసు పలుకుతున్నట్లుంది అని ఆరోపించారు. ఇలాంటి నిర్లక్ష్య అధికారుల మూలంగా విద్య వ్యాపార అయిందన్నారు. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు, కలెక్టర్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సంక్షిప్త వార్తలు

◆ పనులు త్వరగా పూర్తి చేయండి



తాండూరు రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా కొనసాగుతున్న అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ విశ్వప్రసాద్ అన్నారు. శనివారం మండల పరిధి కోటబాసుపల్లి గ్రామం ప్రభుత్వ పాఠశాలలో జరుగుతున్న పనులను ఆయన పర్యవేక్షించి మాట్లాడారు. అన్ని పాఠశాలల్లో పనులు త్వరగా పూర్తి చేయాలని ఎస్ఎంసీ చైర్మన్లను ఆదేశించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి లాలప్ప, హెచ్ఎం శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

◆ ప్రజావాణి కేంద్రం ఏర్పాటు

బొంరాస్‌పేట: మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజావాణి కేంద్రాన్ని శనివారం ఇన్‌చార్జి ఎంపీడీఓ వెంకన్‌గౌడ్ ప్రారంభించారు. సమస్యలు ఏమైనా ఉంటే ప్రజావాణిలో దరఖాస్తు చేసుకోవాలని మండల రైతులు, ప్రజలకు సూచించారు.

◆ లా సెట్ ఫలితాల్లో ప్రతిభ



బషీరాబాద్: తెలంగాణ లా సెట్ 2024 ఫలితాల్లో మండల పరిధికి చెందిన విద్యార్థి ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. జీవన్గీ గ్రామానికి చెందిన పట్లోళ్ల నర్సిరెడ్డి, సువర్ణ దంపతుల మూడో కుమారుడు హరిప్రసాద్ రెడ్డి.. రాష్ట్ర స్థాయిలో 153వ ర్యాంక్ సాధించాడు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు, గ్రామస్తులు హరిప్రసాద్ రెడ్డిని అభినందించారు.

◆ ప్రమాద బాధితులను ఆదుకుంటాం

నవాబుపేట: ఇటీవల చించల్‌పేట గేటు వద్ద ఆటో, సిమెంట్ ట్యాంకర్ ఢీ కొట్టిన ఘటనలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితులను ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల ఇన్‌చార్జి భీమ్ భరత్ తెలిపారు. శనివారం ఎల్లకొండ గ్రామం గాయపడిన బాధితులను, చనిపోయిన వారి కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. ఆర్థిక సాయం అందజేశారు. ప్రమాదంలో ఎల్లకొండకు చెందిన ఇద్దరు చనిపోగా.. 8 మంది గాయపడిన సంగతి తెలిసిందే. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు వెంకటయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకట్ రెడ్డి, కొండల్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, ఉపేందర్ రెడ్డి, నాయకులు వెంకట్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి ఉన్నారు.

◆ సర్కారు బడులు సరస్వతి ఆలయాలు

బొంరాస్‌పేట: సర్కారు బడులు పేద విద్యార్థుల పట్ల చదువుల తల్లి సరస్వతి ఆలయాలు అని కోస్గి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకట్రాములు గౌడ్ అన్నారు. శనివారం మండల పరిధి ఏర్పుమళ్ల ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు పంపిణీ చేశారు. ఇందులో నాయకులు అంజిల్‌రెడ్డి, బందెప్ప, హెచ్ఎం నీలకంఠం, ఉపాధ్యాయులు ఉన్నారు.

◆ పాట ఆవిష్కరణ



అనంతగిరి: 'ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి పథంలో నడుస్తున్నాయని' జిల్లాకు చెందిన అంజిలప్ప రూపొందించిన పాటను ప్రొఫెసర్ కోదండరాం శనివారం హైదరాబాదులో ఆవిష్కరించారు. ఇందులో తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర కార్యదర్శి రవీందర్ గౌడ్, వికారాబాద్ ఎస్ఏల్బీ ప్రిన్సిపాల్ డాక్టర్ గోపిశెట్టి రమణమ్మ, ఓయూ విద్యార్థి నాయకుడు రెడ్డి శ్రీనివాస్, ఎం.కృష్ణయ్య, నరేష్ కుమార్, అంజిలప్ప, టీవీ రాష్ట్ర నాయకులు రతన్ రావు సందేశ్ తదితరులు పాల్గొన్నారు.

నిరంతరాయంగా 'ప్రజాపాలన'

- అర్హులందరికీ 'గ్యారంటీ'లు ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యం
- మున్సిపల్ కమిషనర్ విక్రమ్ సింహారెడ్డి



తాండూరు టౌన్: సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకునేందుకు బారులు తీరిన ప్రజలు

తాండూరు టౌన్: అర్హులందరికీ ఆరు గ్యారంటీ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మున్సిపల్ కమిషనర్ విక్రమ్ సింహారెడ్డి అన్నారు. అందులో భాగంగానే ప్రజాపాలన సేవా కేంద్రం ప్రారంభించినట్లు ఆయన వెల్లడించారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సేవా కేంద్రంలో 90 మంది సంక్షేమ పథకాల కోసం దరఖాస్తు చేసుకోగా.. అర్జీల స్వీకరణ ప్రక్రియను కమిషనర్ పరిశీలించి మాట్లాడారు. గతంలో దరఖాస్తు చేసుకోని వారు కొత్తగా అర్జీ పెట్టుకోవచ్చునని చెప్పారు. గ్యాస్ సిలిండర్ సబ్సిడీ, జీరో విద్యుత్ బిల్లు పొందుతున్నవారు.. మరోసారి దరఖాస్తు చేసుకోవద్దని సూచించారు. అర్జీ పెట్టుకునే వారు ఆధార్, రేషన్, కరెంటు బిల్లు, గ్యాస్ రసీదుతో పాటు మొబైల్ ఫోన్‌ను వెంట తీసుకు రావాలని, సెల్ ఫోన్‌కు వచ్చే ఓటీపీని ఆన్‌లైన్‌లో వెంటనే అప్‌లోడ్ చేస్తామని వివరించారు. సంక్షేమ పథకాలు అందలేదని అర్హులు ఎవరు కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వచ్చే మంగళవారం నుంచి కార్యాలయంలో మరో కౌంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు కమిషనర్ స్పష్టంచేశారు. ప్రజలు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గృహజ్యోతి అందని వారు..

దుద్యాల్: గృహజ్యోతి పథకం అందని వారు మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేయనున్న ప్రజాపాలన సేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని ఏఈ సురేశ్ కుమార్ సూచించారు. ఇటీవలే విద్యుత్ అధికారులు జీరో బిల్లులు అందజేశారని, కొందరికి జీరో రాకపోవడంతో ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, రానివారు ప్రజాపాలన సేవ కేంద్రాల్లో మరోసారి దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. గతంలో అర్జీ పెట్టుకున్నవారు.. నాటి రసీదుతో పాటు ఆధార్, రేషన్, కరెంటు బిల్లుల జిరాక్స్ కాపీలతో సేవా కేంద్రం ప్రతినిధులను సంప్రదించాలని చెప్పారు.

పథకం అందకపోతే ఫిర్యాదు చేయండి

కొడంగల్: అర్హులై ఉండి.. ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీల్లో ఏ పథకం అందకపోయినా మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్ సూచించారు. అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందాలన్న లక్ష్యంతో మున్సిపల్ కార్యాలయంలో ప్రభుత్వం ప్రజాపాలన సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేసిందని, పథకం అందని వారు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.



తాండూరు టౌన్: అర్జీల స్వీకరణ ప్రక్రియను పరిశీలిస్తున్న కమిషనర్ విక్రమ్ సింహారెడ్డి